క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం



వెల్దుర్తి: బాల్య వివాహాలు చేయడం నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి అన్నారు. మంగళవారం మండలంలోని మండాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత చదువులు చదువుకొని మంచి భవిష్యత్‌ను ఏర్పరచుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం చేయాలని ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అర్హత లేకుండా ఎవరికైనా వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారమివ్వాలన్నారు. బలవంతపు పెళ్లిళ్లు చేస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



పిడుగురాళ్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు రాష్ట్ర ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని డీఎల్‌డీవో గబ్రూనాయక్ అన్నారు. పట్టణంలోని ప్రత్యేక అవసరాలు గల పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాగుల కోసం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందని, వాటిల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత విద్యతో పాటు వైద్య సదుపాయం కల్పిస్తుందన్నారు. సదరన్ స్లాట్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్‌ను అందిస్తుందన్నారు. అంతే కాకుండా ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాలుగు రకాల అలవెన్స్‌లు అందిస్తుందని వీటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు, ఎంఈవోలు ఎ.శ్రీనివాసరెడ్డి, వై.శ్రీనివాసరావు, ఐఈ కోఆర్డినేటర్ సేల్వరాజ్, ఈవోపీఆర్‌డీ దయాసాగర్, ఐఈఆర్‌టీ పాఠశాల టీచర్లు కె.హరికుమార్ ఎం.అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి



రెంటచింతల: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం భారతదేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బాబు రాజేంద్రప్రసాద్ నిరాడంబరుడు, విద్యార్థి నాయకులు, ఉన్నత విలువలు ఉన్న మహామనిషి, సంఘ సేవకుడు, ఉదార స్వభావి, స్వాతంత్ర్య సమర యోధుడు అని కొనియాడారు. విద్యావేత్తగా అమూల్యమైన సేవలు చేశారన్నారు. రాష్ట్రపతిగా వేతనం రూ.10 వేలు ఉన్నప్పటికీ కేవలం రూ.2,500 మాత్రమే తీసుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారంతో ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాచవరం: విద్యార్థులు దుర్వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సతీష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మీతో మేము కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు విద్యార్థులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ప్రమాదాలకు గురికావద్దని తెలియజేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాక్డ్ ఫుడ్.. జర జాగ్రత్త

- దుకాణాలలో నాణ్యతలేని చిరుతిండ్లు
- ప్యాకెట్ల తినుబండారాలతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపంగా మారుతున్న వైనం
- కనీస తనిఖీలు నిర్వహించని అధికారులు



దుకాణంలో విక్రయిస్తున్న ప్యాకెట్లు

మాచర్ల రూరల్: చిల్లరకొట్లు కనబడితే చాలు చిన్నారులు చిరుతిండ్లుగా చాక్లెట్లో.. బిస్కెట్లో.. చిప్స్ ప్యాకెట్లో (ప్యాక్డ్ ఫుడ్) అడుగుతుంటారు. చిన్న పిల్లలు కదా అని రూ.5, రూ.10 పెట్టి కొనిస్తుంటాం.. అవే ఇప్పుడు చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. నిత్యం మనం తింటున్న ఆహార పదార్థాలతో పాటు అన్నీ కల్తీమయమవుతున్నాయి. కొందరు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతూ అన్నీ కల్తీ చేసి ఆకర్షణీయ ప్యాకెట్లలో వాటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. పైకి ఎంతో ఆకర్షణీయంగా కనిపించే ప్యాకెట్లలో కల్తీ అయిన ఆహార పదార్థాలను తినటం వలన పిల్లలు అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది. ప్యాకెట్లలోని కల్తీ ఆహారం తిని కొన్నిచోట్ల పిల్లలు అనారోగ్యానికి గురై చనిపోయిన ఘటనలూ ఉన్నాయి.

■ ప్యాకెట్లపై తయారీ, ఎక్స్‌పైరీ తేదీల ముద్రలు కూడా ఉండవు. వ్యాపారులు పిల్లలను ఆకట్టుకునే విధంగా కార్టూన్ బొమ్మలను ప్రచురించి ఆకర్షణీయమైన రంగులలో తయారు చేయటమే కాకుండా వారు ఆడుకునే చిన్న చిన్న బొమ్మలను కూడా ప్యాకెట్లలో అమర్చి దుకాణాల ముందు దండలు దండలుగా వేళ్లాడదీయటం చేస్తుంటారు.

■ అవి చూసిన చిన్నారులు ఆకర్షితులై ఆ ప్యాకెట్లను కొనుగోలు చేసి అందులోని నాసిరకం పదార్థాలను తింటున్నారు. ప్యాకెట్లలోని తినుబండారాలను తినవద్దని పెద్దవారు చెబుతున్నా, తెలిసీ తెలియని వయసు చిన్నారులు తినటం మాత్రం మానటం లేదు.

వ్యాపారమే లక్ష్యంగా కల్తీ

■ చిన్నారుల చిరుతిండ్లనే లక్ష్యంగా చేసుకొని అక్రమార్కులు ప్యాకెట్ల రూపంలో విచ్చలవిడిగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తూ విక్రయిస్తున్నారు. ■ కనీసం కొన్ని రకాల ప్యాకెట్లపై తయారు చేసే కంపెనీ చిరునామా కానీ, ఎంఎఫ్‌డీ గానీ కనిపించవు. అవి కనిపించినా అర్థం కాని రీతిలో ఉంటాయి. కొన్ని ప్యాకెట్లు ప్రముఖ కంపెనీల పేర్లతో ప్రచురించి ఉంటాయి.

■ ఇలాంటి నకిలీ ప్యాకెట్లు విచ్చలవిడిగా ఎక్కడబడితే అక్కడ అమ్ముతున్నా క్వాలిటీ కంట్రోల్ అధికారులు మాత్రం ఎలాంటి దాడులు చేసినట్లు గానీ, వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు గానీ లేవు. నకిలీలపై చర్యలు తీసుకొని చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాణ్యమైన వస్తువులను విక్రయించాలి



పాఠశాలల బయట తినుబండారాల ప్యాకెట్ల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని విక్రయించటంలో వ్యాపారులు లాభాపేక్ష పక్కనపెట్టి నాణ్యమైన వస్తువులను విక్రయించాలి. ప్యాకెట్లు ఎక్కువగా తినటం వలన తరచూ విద్యార్థులు అస్వస్థతకు గురవుతూ వ్యాధుల బారిన పడుతున్నారు. వీటిని నిలుపుదల చేయటంలో అధికారులతో పాటు తల్లిదండ్రులూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– ఐ.వి.నాగమణి, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం, కొప్పునూరు

కంటి వైద్య దాత పీఎస్ఆర్ సేవలు ఎనలేనివి



మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో కంటి ఆసుపత్రి నిర్మించి నిరుపేదలకు ఉచిత సేవలందిస్తున్న పీఎస్ఆర్ కంటాసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ ఆంజనేయులు మాచర్లకు విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం పలికి దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా పీఎస్ఆర్ సేవలు ఎనలేనివని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావులు కొనియాడారు. దేశ విదేశాల్లో కంటి వైద్యునిగా పేరు ప్రఖ్యాతులు పొందినప్పటికీ కన్న ఊరు, దేశానికి సేవలందించాలన్న లక్ష్యంతో లక్షల రూపాయలు వెచ్చించి పట్టణంలో పీఎస్ఆర్ మీనాక్షి కంటి ఆసుపత్రిని నిర్మించిన ఆయన సేవలు పల్నాడు ప్రజలు మరువలేరన్నారు. ఆసుపత్రి నిర్మాణంలో చైర్మన్ చిరుమామిళ్ళ కృష్ణయ్య, కార్యదర్శి డాక్టర్ మురహరిరావు, డైరెక్టర్లు చెరుకూరి నరసింహారావులు అందించిన సహకారం, ఆసుపత్రి అభివృద్ధికి ఎంతగానో దోహదపడిందన్నారు. ఆరోగ్య శ్రీ ట్రస్టును ఆసుపత్రికి తీసుకొచ్చి సుమారు 3,600 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతంగా చేయటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కర్నాటి శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.గోపిరెడ్డి, కేసీపీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు, కోటా హనుమంతరావు, సిండికేట్, మారం వాసు, రంగా జనార్ధన తదితరులున్నారు.

ఏపీఆర్‌డీసీలో 'మీతో మేము' కార్యక్రమం



మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ షఫీ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'మీతో మేము' అవగాహన కార్యక్రమం విజయపురిసౌత్ ఎస్ఐ ఎస్కే మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి మాట్లాడుతూ ప్రస్తుతం యువత సోషల్ మీడియా, క్రైమ్‌లపై అవగాహన రాహిత్యంతో ఏ విధంగా తప్పులు చేస్తున్నారో వివరించారు. ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ డ్రైవింగ్‌లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. యువత యుక్త వయస్సులో భావోద్వేగాలకు లోను కాకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని, నిర్ణయాలపై కుటుంబం ఆధారపడి ఉంటుందని గుర్తు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై 'మీలో మేము-మీతో మేము' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిప్యూటీ వార్డెన్ డాక్టర్ నయిమ్‌భాను, ఏటీపీ డాక్టర్ సతీష్‌బాబు, కెప్టెన్ విజయకుమార్, డాక్టర్ ఎస్కే మహమ్మద్ బాషా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం



లయోల ప్రేమ నిలయంలో చిన్నారులతో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌ఓ బృందం సభ్యులు

మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం మంగళవారం సందర్శించింది. పీహెచ్‌సీలో టీబీ వ్యాధితో బాధపడుతున్న వారిని సందర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలు, తదితర అంశాలపై వైద్యులతో చర్చించారు. తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ సమీపంలో ఉన్న లయోల ప్రేమ నిలయాన్ని సందర్శించి, అందులో విద్యనభ్యసిస్తున్న చిన్నారులను పలకరించి, వారి ఆరోగ్య విషయాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధుల బృందం సభ్యులు డాక్టర్ భవాని, డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా క్షయ అధికారి ఎస్‌టీఓ అరుణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాద్, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షాలకు నేల వాలిన వరి పంట



నేల వాలిన వరి పంట



కోసిన వరిని పరదాలు కప్పిన రైతులు

పిడుగురాళ్ల: అకాల వర్షాలతో వరి రైతులు అతలాకుతలమవుతున్నారు. గత మూడు రోజుల నుంచి మబ్బులు కమ్మడం, సోమవారం సాయంత్రం నుంచి వర్షం పడటంతో రైతులు చేతికి వచ్చిన పంట నీళ్ల పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతుల వరి పంట కోతకు వచ్చి ఉండటంతో వర్షానికి, గాలికి వరి కంకులు నేల వాలాయి. మరికొంత మంది రైతుల పంటలు కోసి కుప్పలను నూర్పే దశలో ఉండగా మరి కొంత మంది కోసిన ధాన్యపు గింజలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా వరి రైతులకు ఈ అకాల వర్షం మాత్రం నష్టం చేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్నాటి కాశి కారెంపూడి



రణక్షేత్రంలో వీరాచారుల సందడి

ఉత్సవ శోభతో అలరారిన పల్నాటి రణక్షేత్రం

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కోడి పోరు నాడు జనం పోటెత్తారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే కోడి పోరును తిలకించడానికి అలాగే పల్నాటి వీరుల ఆయుధాలను దర్శించుకోడానికి తరలివచ్చారు. వీరుల గుడితో పాటు అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. వీరాచారులు వీరంగాలు, వీరావేశంతో వీరాచారులు చేసుకున్న కత్తి సేవలు, వీరతాళ్లతో వంటిపై చెన్నకేశవుని సన్నిధిలో కొట్టుకోవడం లాంటి ఘటనలతో రణక్షేత్రం పౌరుషంతో నిండిపోయింది. అలాగే వీరాచార మహిళలు అంకమ్మ బుట్టలతో పొంగళ్లతో అంకాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పల్నాటి రణక్షేత్రం కాశి కదా పలినాటి వారికిన్ అని ఆనాడు శ్రీనాథుడు రాసిన రాతలు నిజమనేందుకు పల్నాటి ఉత్సవాలే నిదర్శనంగా కన్పిస్తున్నాయి. వీరులు దివ్య లింగములుగా విష్ణువు చెన్నకేశవునిగా, అన్నపూర్ణాదేవే అంకాలమ్మగా, నాగులేరు గంగధారి మడుగు మణికర్ణిక నదిగా వర్ణించారు. అదే విధంగానే పల్నాటి వీరాచారుల ఆచార వ్యవహారాలు పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ప్రజలు పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు చేసి ఆశీస్సులు పొందారు. పల్నాటి వీరుల ప్రభలు, సాంఘిక నాటకాలు, కోలాట ప్రదర్శనలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సవ ప్రాంగణంలో కొలువు దీరిన వివిధ రకాల వినోద పరికారాలు అదనపు శోభను చేకూర్చాయి.

పల్నాటి ఉత్సవాలలో వైద్య సేవలు



కారెంపూడి: పల్నాటి ఉత్సవాలలో వైద్య ఆరోగ్య శాఖ గత నాలుగు రోజులుగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీరాచారులకు వైద్య సేవలందిస్తోంది. పల్నాడులోని పీహెచ్‌సీల డాక్టర్లు వంతుల వారీగా డ్యూటీలు నిర్వహిస్తున్నారు. అలాగే ఆయుర్వేద వైద్య సేవలను ఆయుష్ శాఖ అందిస్తోంది. డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి మంగళవారం ఉచిత వైద్య శిబిరం పనితీరును తనిఖీ చేశారు. రేపటి వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఉత్సవాలకు వచ్చిన వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోందని బీపీ, షుగర్ మందులు ఇతర అత్యవసర మందులను మెడికల్ షాపులకు వెళ్లకుండా అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూలస్నానం

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయంలో త్రిశూలస్నానం వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్షబిల్వార్చన వేడుకల్లో భాగంగా స్వామివారి త్రిశూలస్నాన ఘట్టం పవిత్రంగా జరిపించారు. అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి త్రిశూలాన్ని భక్తిశ్రద్ధలతో కోనేటి వద్దకు తీసుకువెళ్లి పూజాధికాలు నిర్వహించారు. అనంతరం కోనేటిలో త్రిశూల స్నాన ఘట్టం జరిపించారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్నానఘట్టం అనంతరం విశ్వరూప అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అన్నప్రసాద వితరణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పశుగ్రాస క్షేత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అచ్చంపేట: మండలంలో పశువులు, గొర్రెలు, మేకలు పెంచుకునే రైతులు గ్రాసం కోసం తమ భూములలో కొంత భాగాన్ని కేటాయించేవారికి ప్రభుత్వం ఊరూర పశుగ్రాస క్షేత్ర పథకం ద్వారా ఆర్థిక చేయూతనివ్వనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్వేతాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాల భూమి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్న, చిన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని చెప్పారు. 5 ఎకరాల భూమి కలిగినవారు పశుగ్రాసానికి 10 నుంచి 50 సెంట్ల స్థలాన్ని కేటాయించవలసి ఉంటుందన్నారు. ఈ పథకానికి రైతులు పశువైద్యా కేంద్రం, రైతుసేవాకేంద్రం, పశుగణన కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న రైతులలో అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన రైతులు బహువార్షిక గడ్డిని రెండేళ్ల పాటు పెంచవలసి ఉంటుంటుందన్నారు. పూర్తి వివరాలకు సమీప రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో సంప్రదించవలసినదిగా డాక్టర్ శ్వేతాదేవి తెలిపారు.

స్వాములకు సద్ది వితరణ



రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో మంగళవారం వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ నేతృత్వంలో జిగురు చంద్రశేఖర్ భక్తిశ్రద్ధలతో హోమాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ రోజు మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన తిరుమలకొండ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు 380 మంది స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి స్వామి, బరువు శివారెడ్డి, కె.సైదులు స్వామి, కట్టమూరి శ్రీను స్వామి, గుండా రాము ఏర్పాట్లను పర్యవేక్షించారు. గత 19 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా 51 రోజుల పాటు మాలధారులకు సద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

దివ్యాంగులకు సేవాభావంతో విద్యనందించాలి



దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్

మాచర్ల రూరల్: దివ్యాంగులు ప్రత్యక్ష దైవాలని వారికి సేవాభావంతో విద్యనందించి వారిలోని ప్రతిభను వెలికితీసి స్వయం శక్తితో వారు ఎదిగేలా తోడ్పాటునందించాలని జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని సూర్యకిరణ్ మానసిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానసికంగా ఎదుగుదల లేని దివ్యాంగులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుల కృషి, సేవా గుణం ఎనలేనిదన్నారు. అన్నీ ఉన్న చిన్నారుల విద్యాభ్యాసంలోనే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే అంధత్వాన్ని కూడా అధిగమించవచ్చునని, దివ్యాంగులై ఉండి ఉన్నత విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు గుండాల సైదులు, శ్రీనివాసరాజు తదితరులున్నారు.

దైవ ప్రేమ.. సోదర ప్రేమ కలిగి ఉండాలి



సమిష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ నిఖిల్ తేజ, ఫాదర్ అగస్టీన్

రెంటచింతల: ప్రేమజీవి పునీత అంతోని వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఇతరుల పట్ల సోదర ప్రేమ కలిగి ఉండాలని దాచేపల్లి విచారణ గురువులు రెవ.ఫాదర్ కోడిగంటి నిఖిల్ తేజ అన్నారు. స్థానిక అంతోని వారి చర్చిలో 9 మంగళవారాలను పురస్కరించుకుని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి నేతృత్వంలో సహాయక గురువులు ఫాదర్ అగస్టీన్‌తో కలసి ఆయన 7వ మంగళవారం సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా రెవ. ఫాదర్ నిఖిల్ తేజ భక్తులను ఉద్దేశించి పునీతుల జీవితం.. క్రైస్తవులకు ఆదర్శం అనే ధ్యానాంశంపై మాట్లాడుతూ ఏసుక్రీస్తు సూక్తులను అంతోని వారు ఆచరించి దైవ ప్రేమ, సోదర ప్రేమ కలిగి ఉండాలని బోధనలు చేస్తూ తాను కూడా క్రీస్తు సువార్త ప్రచారం వలన పునీతుడయ్యారన్నారు. పునీత అంతోని వారి అడుగుజాడలలో నడిచి ఆపదలో నున్న వారి పట్ల ప్రేమ, దయ, కరుణ, జాలి చూపి నిజమైన కథోలికులుగా సమాజంలో మెలగాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ పూజాబలిలో మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం సురేష్ కుమార్

మాచవరం: దివ్యాంగుల పట్ల సానుభూతి చూపించడం కంటే వారిని ఆదరించి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చబడతారని హెచ్‌ఎం కె.సురేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన మాచవరం మోయిన్ స్కూల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ దివ్యాంగులు అసమానమైన ప్రతిభాపాటవాలు కలిగి ఉంటారని, వారిని ప్రోత్సహించడం అందరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈడీ కో ఆర్డినేటర్ ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు భార్గవి, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, జయప్రద పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

క్రోసూరు: బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ అన్నారు. మంగళవారం అమరావతి, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు పీహెచ్‌సీలో బాలల హక్కులు, బాల్యవివాహాల నిర్మూలన అనే అంశంపై ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుడ్‌షెపర్డ్స్ సంస్థ మండల ఇంచార్జి తందు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ పిల్లలు దేశ సంపద అని, వారిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిర్మూలించాలన్నారు. గుడ్ షెపర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి మాట్లాడుతూ తమ సంస్థ 74 దేశాల్లో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న హింసలకు వ్యతిరేకంగా, బాలల హక్కులపై పనిచేస్తుందన్నారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖా శ్యాంసన్, పర్యవేక్షకులు ప్రభావతి, అమర జ్యోతి, శివుడు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.